క్లుప్తంగా

నేడు గ్రామసభలు

గంగవరం: మండలంలోని 17 పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో బి.శ్రీనివాసులు తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో 17 పంచాయతీల్లో సర్పంచుల ఆధ్వర్యంలో ఈ గ్రామసభలు జరుగుతాయన్నారు. ఇందుకు ప్రతీ పంచాయతీకి ప్రత్యేక అధికారులను నియమించినట్టు చెప్పారు. గ్రామసభల దృష్టికి వచ్చిన సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు.

కూనవరం తహసీల్దార్‌గా నాగబాబు



కూనవరం: కూనవరం తహసీల్దార్ కె.నాగబాబు(ఎఫ్ఏసీ) గురువారం విధుల్లో చేరారు. పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ చింతూరు డివిజన్ కూనవరం యూనిట్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న నాగబాబుకు కూనవరం తహసీల్దార్ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు రావడంతో ఆయన విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు కార్యాలయంలో ఇబ్బంది సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారాని తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

ప్రకృతి సాగుతో మేలైన దిగుబడులు

జి.మాడుగుల: మండలంలో గడుతూరు పంచాయతీ కేంద్రంలో గురువారం ప్రకృతి వ్యవసాయ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సాధికార సంస్థ గడుతూరు ఇన్‌చార్జి జర్రా కృష్ణారావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో మేలైన దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రకృతి సిద్ధంగా తయారీ చేసిన ఎరువులు వినియోగించాలని సూచించారు. ఎరువుల, బీజామృతాల తయారీపై రైతులకు ఆయన అవగాహన కల్పించారు. పంటకు తెగుళ్లు సోకుండా తీసుకొనే జాగ్రత్తలను వివరించారు.

క్రీడల్లో రాణించాలి

చింతపల్లి: గిరిజన యువత క్రీడల్లో రాణించి మన్యానికి మంచి పేరు తీసుకురావాలని చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయభారతి అన్నారు. ఈ నెల 29న కళాశాలలో క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పలు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఆమె పరిచయం చేసుకున్నారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పెదబయలు: గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను గురువారం నిర్వహించారు. పోటీల్లో సుమారు 266 మంది విద్యార్థులు పాల్గొన్నారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు టి.నాగేశ్వరరావు, వి.చలపతిరావు మాట్లాడుతూ తెలుగు భాష దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ పోటీలు నిర్వహించినట్టు చెప్పారు. తెలుగు భాష పట్ల విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. ఉపాధ్యాయులు బాలక్రిష్ణ, రవికుమార్, నాయుడు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

గంగవరం: మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో సీడీపీవో లక్ష్మీ ఆధ్వర్యంలో మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు క్రమశిక్షణగా మెలుగుతూ మంచి విద్యాభ్యాసం పొందాలన్నారు. బాలికల హక్కులు, చట్టాలు, పోక్సో, బాల్య వివాహాల అనర్థాలు, పౌష్టికాహారం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఏఎస్ఐ రాంబాబు, ఐసీడీఎస్ సూపరువైజర్ టి.సత్యవతి, హెల్త్ సూపర్‌వైజర్ రత్నం తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ఎటపాక: శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎటపాక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.కన్నపరాజు హెచ్చరించారు. సీఐగా బాధ్యతలు చేపట్టి గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి సాగు, రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే సహించేది లేదన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలంతా పోలీసులకు సహకరించాలని కోరారు.

డ్రగ్స్ రహిత సమాజమే ధ్యేయం



పెదబయలులో విద్యార్థుల మానవహారం, చిత్రంలో పోలీసులు



జి.మాడుగులలో ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ గౌరీశంకర్, పోలీసులు, విద్యార్థులు



ముంచంగిపుట్టులోని అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ ఎస్ఐ రవీంద్ర

- మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన
- వాడవాడలా విద్యార్థుల ర్యాలీలు, సదస్సులు

పెదబయలు: యువత చెడు అలవాట్లకు బానిస కావద్దని, వ్యసనాలకు దూరంగా ఉండాలని మండల కేంద్రంలో ఇన్‌చార్జి ఎస్ఐ జి.కుమార్ బాబు అన్నారు. మండల కేంద్రంలో మోటార్ యూనియన్, విద్యార్థులతో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎస్ఐ జి.కుమార్‌బాబు మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా అందరూ సహకరించాలని కోరారు. పెదబయలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం నుంచి ర్యాలీ చేపట్టారు. ప్లకార్డులు పట్టుకుని గంజాయి ,సారా, మత్తు, ఇతర చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని, ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణానికి కృషి చేయాలని నినాదాలు చేశారు. అనంతరం అంబేడ్కర్ కూడలిలో మానవహారం ఏర్పడి యాంటీ డ్రగ్‌పై నినాదాలు చేశారు. దేశ భవిష్యత్తు యువతతోనే ప్రగతి సాధిస్తుందన్నారు. కార్యక్రమానికి పోలీసులు, మోటార్ యూనియన్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: గంజాయి, మద్యం వంటి మత్తు పానీయాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ గౌరీశంకర్, పోలీసులు తెలిపారు. మండలం కేంద్రంలో గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ , విద్యార్థులు, పోలీస్ సిబ్బంది కలసి గంజాయి నివారణ కార్యక్రమంలో భాగంగా బ్యానర్లు, ప్లకార్డులతో ర్యాలీ అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యువత వ్యసనాల జోలికి పోవద్దన్నారు. ఉన్నత విద్యపై దృష్టి సారించాలన్నారు. ఉత్తమ పౌరులుగా ఎదిగి గ్రామాలకు, తల్లిదండ్రులు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమని వాటికి దూరంగా ఉండాలన్నారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది.పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: ప్రతి ఒక్కరూ సమాజంపై బాధ్యతగా మెలగాలని ఎస్ఐ రవీంద్ర అన్నారు.మండల కేంద్రంలో గురవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో వర్తకులు, మోటార్ యూనియన్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గిరిజనులతో సమావేశం నిర్వహించారు. గంజాయి వల్ల కలిగే అనర్థాలు, వారపు సంతలో ట్రాఫిక్ సమస్య, వాహన ప్రమాదాలు తదితర విషయాలపై చర్చించారు.ఈ సందర్భంగా ఎస్ఐ రవీంద్ర మాట్లాడుతూ ప్రజలు పోలీసులకు సహకారం అందించాలని కోరారు. గంజాయి వల్ల గిరిజన యువత జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. అధిక శాతం గిరిజనులే గంజాయి అక్రమ రవాణాలో అరెస్టులు అవుతున్నారని దీంతో వారి జీవితాలు నాశమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, సారా వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. వారపు సంతలో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టామని, వాహచోదకులు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధిత చిన్నారులకు పరామర్శ





చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శిస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, వైఎస్సార్‌సీపీ అల్లూరి జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి తదితరులు

మహారాణిపేట: అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలో ఆహారం కలుషితమై అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మిషనరీ ట్రస్టుకుచెందిన చిన్నారులను గురువారం అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పరామర్శించారు. డాక్టర్ అశోక్‌తో కలిసి ఆశ్రమ చిన్నారులు చికిత్స పొందుతున్న చిన్న పిల్లల వార్డులో పర్యటించారు. ప్రతి చిన్నారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు మనోధైర్యం కల్పించారు. పిల్లలు త్వరితగతిన కోలుకునేలా మెరుగైన వైద్య సేవలు అందించాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానందానికి ఎమ్మెల్యే మత్స్యలింగం సూచించారు.

జెడ్పీ చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మహారాణిపేట: విషాహారంతో అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ట్రస్ట్ చిన్నారులను వైఎస్సార్‌సీపీ అల్లూరి జిల్లా అధ్యక్షులు, పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర పరామర్శించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ట్రస్ట్ నిర్వహిస్తున్న ఆశ్రమం పనితీరు, అందిస్తున్న సేవల తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. కలుషిత ఆహారం తీసుకున్న తర్వాత ట్రస్టు నిర్వాహకులు ఏం చేశారు? అన్న వివరాలను తెలుసుకున్నారు. చిన్నారులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని సూపరింటెండెంట్, వైద్యులను కోరారు.



డిశ్చార్జి అయిన విద్యార్థులను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న సూపరింటెండెంట్ తదితరులు

జిల్లా ఆస్పత్రి నుంచి ఎమిమిది మంది విద్యార్థుల డిశ్చార్జి

పాడేరు: కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని ఓ మిషనరీ వసతి గృహంలో చోటుచేసుకున్న కలుషిత ఆహారం ఘటనలో పాడేరు జిల్లా ఆస్పత్రిలో వైద్య చికిత్సలు పొందుతున్న ఎనిమిది మంది విద్యార్థులు గురువారం సాయంత్రం డిశ్చార్జి అయ్యారు. ఎనిమిది మంది విద్యార్థులు పూర్తిగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండడంతో డిశ్చార్జి చేశామని ఆస్పత్రి సూపరిండేండ్ డాక్టర్ విశ్వమిత్ర తెలిపారు. విద్యార్థులను వారి కుటుంబ ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ విశ్వమిత్ర, రెవెన్యూ, పోలీస్ శాఖ సిబ్బంది సమక్షంలో సభ్యులకు అప్పగించారు ఆస్పత్రిలో చికిత్స పొందిన విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.50వేలు పరిహారంగా అందజేస్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు.

విద్యా వలంటీర్ల ఎంపిక

కొయ్యూరు: సెప్టెంబర్ నుంచి పాఠశాలలు లేనిచోట్ల ఏర్పాటు చేస్తున్న ఎన్ఆర్ఎస్టీసీ కేంద్రాలు ప్రారంభమవుతాయని ఎంఈవో ఎల్.రాంబాబు గురువారం తెలిపారు. మండలంలో పది కేంద్రాలకు సంబంధించి విద్యా వలంటీర్ల నియామకం పూర్తయిందన్నారు. డీఎడ్ చేసిన వారిని మాత్రమే డీఈవో ఎంపిక చేశారన్నారు. జోటంపేటకు కాకరికుమారి, కాకులమామిడికి దొండపందిరి లోవరాజు, కొమ్మునూరుకు ఐఎస్ఆర్‌సీ చంద్రపడాల్, ఉసరికపాడుకు గెమ్మెలి సన, బొడ్డుమామిడిలంకకు వనపల నాగరాణి, ఈదులబంధకు పల్లల బాబిరాజు, గంపరాయికి పాంగి శివ, వైఎస్ పాకలకు పాగి భవానీ, పుట్టకోటకు రోకపల్లి విశ్వమ్మ, గొంధికోటకు ఆర్.రత్నకుమారిని ఎంపిక చేశారన్నారు. ఆయా కేంద్రాలకు సమీపంలో ఉన్న పాఠశాలల నుంచి మధ్యాహ్న భోజనం సరకులను పొందవచ్చన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ కృష్ణారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు

గంగవరం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉపాధి హామీ పథకం ఏపీవో ప్రకాశ్ ఆధ్వర్యంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి , ఎంపీడీవో బి.శ్రీనివాసులు, పీహెచ్‌సీ వైద్యాధికారి భావన మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు వారి సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఉపాధి హామీ ఏపీఓ పద్మనాభం, ఫీల్డ్ అసిస్టెంట్ చిన్నాలరావు, టీఏలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పశువ్యాధులపై అవగాహన

దేవీపట్నం: ఇందుకూరుపేటలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో పశువులకు చికిత్స అందించారు. గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో పశువులకు టీకాలు వేశారు. పశువ్యాధులపై అవగాహన కల్పించారు. ఏడీ సూర్యరాయణ, వైద్యులు రేవంత్, రికీరాయ్, సిబ్బంది పాల్గొన్నారు.

బంకులో పెట్రోలు కల్తీ అమ్మకాలపై దుష్ప్రచారం తగదు

చింతపల్లి:గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న హెచ్‌పీసీఎల్ పెట్రోలు బంకుల్లో నాణ్యమైన పెట్రోలు, డీజిల్ విక్రయాలు జరుపుతున్నామని కొందరు కావాలని తమ సంస్థపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని దీన్ని ఎవరూ నమ్మవద్దని చింతపల్లి జీసీసీ పెట్రోలు బంకు పర్యవేక్షకుడు రామకృష్ణ తెలిపారు. చింతపల్లి జీసీసీ పెట్రోలు బంకులో పెట్రోలుకు బదులు నీళ్ల వస్తున్నాయంటూ కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారన్నారు. ఈ విషయంపై వినియోగదారుల్లో అపోహలు తొలగించాలన్న ఉద్దేశంతో బంకుల్లో పెట్రోలు నాణ్యతపై డెమో నిర్వహించినట్టు తెలిపారు. తమ సంస్థకు చెందిన పెట్రోలు బంకుపై తప్పుడు ప్రచారం చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు జీసీసీ బంకు పర్యవేక్షకుడు రామకృష్ణ తెలిపారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

పెదబయలు: గోమంగి పీహెచ్‌సీ పరిధిలోని తామరవీధి, తాడేవీధి గ్రామాల్లో పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో సుమారు 64 మందికి వైద్య పరీక్షలు చేశామన్నారు. ఇందులో 30 మందికి వైరల్ జ్వరాలు, 20 మందికి చర్మ వ్యాధులు, రెండు డయేరియా కేసులున్నాయని, రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్టు చెప్పారు. సిబ్బంది విజయలక్ష్మీ, జానకి, కళావతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: కొండలింగంపర్తి, కరుదేవపాలెం గ్రామాల్లో గురువారం జరిగిన ఫ్యామిలి డాక్టర్ వైద్య శిబిరంలో 48 మంది రోగులకు వైద్యసేవలు అందించినట్టు డాక్టర్ యామినిప్రియ తెలిపారు. ఉచితంగా మందులు అందజేశామన్నారు.

విస్తృతంగా దోమల నివారణ మందు పిచికారీ

గూడెంకొత్తవీధి: మలేరియా నివారణే లక్ష్యంగా దోమల నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టామని జీకే వీధి అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ అన్నారు. మండలంలోని రింతాడలోని అసరాడ గ్రామంలో గురువారం చేపట్టిన రెండో విడత దోమల నివారణ మందు పిచికారీ పనులను పర్యవేక్షించారు.

108 సిబ్బందికి శిక్షణ

అడ్డతీగల : స్థానిక 108 కార్యాలయంలో వై.రామవరం, అడ్డతీగల రాజవొమ్మంగి, , గంగవరం తదితర మండలాల్లోని 108 అంబులెన్స్ సిబ్బందికి గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వాహనంలోని వైద్య పరికరాల వినియోగం, అత్యవసర సేవలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. 108 సూపర్‌వైజర్ శ్రీనివాసు, సిబ్బంది పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



కొయ్యూరులో కొవ్వొత్తులతో స్థానికుల ర్యాలీ



మారేడుమిల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



ముంచంగిపుట్టులో ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు

ముంచంగిపుట్టు/కొయ్యూరు/మారేడుమిల్లి: కోల్‌కతాలోని జూనియర్ డాక్టర్‌ను అతి దారుణంగా హత్యాచారం చేసి, అమె మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ముంచంగిపుట్టు, కొయ్యూరు, మారేడుమిల్లిలో గురువారం నిరసన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆస్పత్రుల్లో పనిచేసే మహిళలకు ప్రత్యేక రక్షణ చట్టాలను అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ కొండ జాకబ్, జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు, వైస్ ఎంపీపీ రవికుమార్, సత్యనారాయణ రెడ్డి, లక్ష్మి శ్రీనివాసు రెడ్డి, వైస్ సర్పంచ్ వీరబాబు, చిన్న నారాయణ రావు, దావీద్, అప్పాజీ, సుభాన్, ప్రణీత్ లక్ష్మణ్, బూత్ కమిటీ చైర్మన్ బుజ్జిబాబు, జీపీ పాఠశాల కమిటీ చైర్మన్ సుధీర్‌బాబు, మహిళా అధ్యక్షురాలు భువనసాయి జయంతి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం



అమిడేల పెద్దమ్మి(ఫైల్)

పెదబయలు: మండలంలోని బొంగరం మాజీ సర్పంచ్ అమిడేల పెద్దమ్మి(80) అనారోగ్యంతో చిత్రకాయపుట్టులోనే మృతి చెందారు. బొంగరం పంచాయతీలో 2014 నుంచి 2019 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. వైఎస్సార్ సీపీ మద్దతుతోనే సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. పంచాయతీలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారని, ముఖ్యంగా రహదారుల నిర్మాణానికి కృషి చేసినట్టు పలువురు చెప్పారు. ప్రస్తుతం ఆమె కుమారుడు అమిడేల ప్రసాద్ నాయుడు వైఎస్సార్‌సీపీలో నాయకుడిగా పనిచేస్తున్నారు. చిత్రకాయపుట్టులో అంత్యక్రియలు జరగనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతికి పలువరు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

పాఠశాలల్లో మెనూ అమలుచేయాలి

- పోలీసు, రెవెన్యూ సిబ్బంది తనిఖీలు



జాంగుడ ఆశ్రమ పాఠశాలలో తనిఖీ చేస్తున్న పోలీసుస్టేషన్ సిబ్బంది



దాలిపాడు ఆశ్రమ పాఠశాలలో సౌకర్యాలను పరిశీలిస్తున్న సీఐ నరసింహమూర్తి

డుంబ్రిగుడ: ఇటీవల అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలంలోని ఆశ్రమంలో కలుషిత ఆహారం తిని మృతి చెందిన విద్యార్థుల సంఘటనలు పునరావృతం కాకూడదని ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసు, రెవెన్యూ తదితర శాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలలను విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. డుంబ్రిగుడలోని ప్రభుత్వ బాలుర ఆశ్రమ, బాలికల ఆశ్రమ పాఠశాలతో పాటు కిల్లోగుడ, ప్రభుత్వ ఆశ్రమ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జైపూర్ జంక్షన్ ఉద్ద ఉన్న ఇంగ్లిష్ మీడియం పాఠశాలను డుంబ్రిగుడ పోలీసులు తనిఖీ నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యాలను పరిశీలించారు. మెనూకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని స్థానిక పోలీసుస్టేషన్ రైటర్ పూరందర్ సూచించారు. హెచ్ఎంలున్నారు.

వై.రామవరం: మండలంలోని కోట, దాలిపాడులోని ఆశ్రమ పాఠశాలలను సీఐ బి.నరసింహమూర్తి గురువారం సందర్శించారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను, తాగునీరు, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులకు వండిన భోజనాన్ని, మెనూను, తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐ ఎం.సంతోష్‌కుమార్ తదితరులున్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. పెండింగు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ అవరణలో ఉన్న సిఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అదనపు బలగాల భద్రతా ఏర్పాట్లను, వారికి కల్పించిన సౌకర్యాలను తనిఖీ చేశారు. విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

ఆత్మీయ వీడ్కోలు



సీఐ అశోక్‌కుమార్ దంపతులను సత్కరిస్తున్న సచివాలయ పోలీసులు

గూడెంకొత్తవీధి: బదిలీపై వెళ్తున్న గూడెంకొత్తవీధి సీఐ అశోక్‌కుమార్‌ను గురువారం స్థానిక సచివాలయ పోలీసులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ అశోక్‌కుమార్ దంపతులను శాలువాలతో సన్మానించారు. రెండేళ్లపాటు గూడెంకొత్తవీధిలో సీఐగా విధులు నిర్వహించిన అశోక్‌కుమార్ ప్రధానంగా గంజాయి సాగు నిర్మూలన అక్రమ రవాణాను అడ్డుకోవడంతో మంచి ఫలితాలను సాధించారని వారు కొనియాడారు. ఆపరేషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా అనేక కార్యక్రమాలను అమలు చేశారన్నారు. విజయనగరం రూరల్ సీఐగా వెళ్తున్న అశోక్‌కుమార్ మాట్లాడుతూ తనకు విధినిర్వహణలో సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

రాజ్‌మా విత్తనాల పంపిణీ



అరకులో రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శారద, ఎంపీటీసీ వరహాలమ్మ

డుంబ్రిగుడ: గిరి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న 90 శాతం రాయితీ విత్తనాలను గురువారం వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్, సర్పంచ్ హరి తదితరులు మండలంలోని కంద్రుం పంచాయతీలో పంపిణీ చేశారు. అరకులో సర్పంచ్ శారద, ఎంపీటీసీ వరహాలమ్మ రైతులకు రాజ్‌మా విత్తనాలు అందజేశారు. రైతులు ఆర్థికాభివృద్ధికి వాణిజ్య పంటలు ఎంతో దోహదపడతాయన్నారు. వార్డు సభ్యులు శోభన్‌బాబు, ఏఈవో పురుషోత్తంనాయుడు, దేవి, మహిళ పోలీసు సునీత, డిజిటల్ అసిస్టెంట్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండల కేంద్రంలోని దాలిగుమ్మడి ఆర్‌బీకేలో గురువారం గిరిజనులకు రాజ్‌మా విత్తనాలను సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్‌మా పంట సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. ఏవో లీలావతి ,సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో సమస్యపై కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్‌కు ఫిర్యాదు



పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ గంగరాజు, ఎంఈవో బాలాజీ

అనంతగిరి (అరకులోయ రూరల్): అనంతగిరి మండల కేంద్రంలో గల బాలికల ఆశ్రమ పాఠశాల బాలికల-2ను జెడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు గురువారం సందర్శించారు. వసతి గృహాన్ని పరిశీలించారు. పాఠశాలలో మరుగుదొడ్లు ప్రధానమైన సమస్యగా ఉన్నట్టు గుర్తించారు. పాఠశాలలో సుమారు 500 మంది విద్యార్థినులకు కేవలం 10 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయన్నారు. దీంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యను కలెక్టర్ దినేష్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ, ఎంఈవో బాలాజీ, హెచ్ఎం మంగమ్మ, వార్డెన్ రాజ్యలక్ష్మి, గిరిజన సంఘం నాయకులు నాగులు, నరాజీ సురేష్‌బాబు, తదితరులున్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



విజన్(ఫైల్)



జిల్లా ఆస్పత్రి వద్ద మృతుడి కుటుంబ సభ్యులతో ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాడేరు: గొంతులో కాయ కారణంగా స్థానిక జిల్లా ఆస్పత్రిలో చేరి వైద్య చికిత్సలు పొందుతున్న ఓ గిరిజన విద్యార్థి గురువారం సాయంత్రం మృతి చెందాడు. పెదబయలు మండలం కిముడుపల్లి పంచాయతీ పులిగొంది గ్రామానికి చెందిన పాంగి విజన్ అనే గిరిజన విద్యార్థి పెదబయలు గిరిజన గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆగస్టు 12న విద్యార్థికి గొంతు వాపు రావడంతో కళాశాల యాజమాన్యం ఇంటికి పంపించారు. దీంతో కుటుంబ సభ్యులు అతడిని పాడేరు జిల్లా ఆస్పత్రిలో చేర్చగా, చికిత్స పొందుతూ గురువారం విద్యార్థి మృతి చెందాడు. కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్సార్‌సీపీ నాయకులు మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కె.సురేష్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ వి.అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు రామారావు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. విద్యార్థి మృతికి కళాశాల యాజమాన్యం కారణమని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం, ఐటీడీఏ పీవో, కలెక్టర్ స్పందించి బాధిత విద్యార్థి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, ఐటీడీఏ పీవో, కలెక్టర్ స్పందించేంత వరకు మృతదేహాన్ని తీసుకువెళ్లేది లేదని స్పష్టం చేశారు.

రహదారుల నిర్మాణానికి సర్వే చేయాలి



మాట్లాడుతున్న సీడీపీవో నాగలక్ష్మి

కూనవరం: ఎంపీపీ పాయం రంగమ్మ ఆధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, జగ్గవరం, చినార్కూరు, కొండ్రాజుపేట సర్పంచ్‌లు కారం పార్వతి, సున్నం అభిరామ్, కట్టం లక్ష్మి, తెల్లం నిరోషాలు మాట్లాడుతూ గోదావరి వరదల సమయంలో అత్యవసర సేవలు పొందేందుకు కోతులగుట్ట - ఏడుగురాళ్లపల్లి, చినార్కూరు సచివాలయం- బోదునూరు, బురదగూడెం- తుమ్మల రోడ్ల నిర్మాణానికి జాయింట్ సర్వే చేపట్టాలన్నారు. జగ్గవరం, చూచిరేవుల గూడెంలో ఒకే సర్వే నెంబర్‌తో ఇద్దరికి భూ కేటాయించడంపై సమగ్ర విచారణ చేయాలని చూచిరేవుల గూడెం సర్పంచ్ తెల్లం నిరోషా సమావేశం దృష్టికి తెచ్చారు. వరదల సమయంలో టార్పాలిన్లు ఇవ్వకపోవడం దారుణమని ఇప్పటికైనా టార్పాలిన్లు, దోమతెరలు పంపిణీ చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును సీడీపీవో నాగలక్ష్మి వివరించారు. ఎంపీడీవో లక్ష్మిరెడ్డి, తహసీల్దార్ కె.నాగబాబు, వైస్ ఎంపీపీ సాంబశివరావు, సర్పంచ్ హేమంత్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు సర్పంచ్‌లు, కార్యదర్శులు, పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై సర్వే

కొయ్యూరు: జల్‌జీవన్ మిషన్‌లో ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయిలు పని సామర్థ్యతపై గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వతేజ ఆధ్వర్యంలో బట్టపనుకుల గ్రామంలో సర్వే చేశారు. ఇంటింటికీ వెళ్లి తాగునీటి సరఫరా పనితీరును అడిగి తెలుసుకున్నారు. కుళాయిల నిర్వహణ బాధ్యతకు కమిటీలను నియమించారు. అనంతరం నడింపాలెంలో జరిగిన కార్యక్రమంలో కలుషిత నీటి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డీపీఎంయు జిల్లా కో-ఆర్డినేటర్ పుల్లయ్య, సర్పంచ్ బాలకృష్ణ, డీపీఎం రాజేష్, ఆనంద్ ఉన్నారు.